వసతి గృహాలు శుభ్రతకు నిలయాలుగా మారాలి

కౌడిపల్లిలోని సమీకృత బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కలెక్టర్ రాహుల్ రాజ్

కౌడిపల్లి, ఏప్రిల్16: వసతి గృహాలు శుభ్రతకు నిలయాలుగా మారి క్రమశిక్షణతో కూడిన విద్యాబోధన, మెనూ ప్రకారం ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. దీనికి విరుద్ధంగా ఎవరైనా ప్రవర్తిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బుధవారం ఆయన మండలంలోని సమీకృత బాలికల వసతి గృహాన్ని క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 105 ప్రభుత్వ సంక్షేమ పాఠశాలు, వసతి గృహాల్లో శుభ్రతతో పాటు నాణ్యతో కూడిన నూతన మెనూను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. కౌడిపల్లి సమీకృత గృహంలో ఆదివారం అల్పాహారం తిని అస్వస్థతకు గురైన ఘటనకు స్పందించి బాలికలకు మెరుగైన చికిత్సను అందించడం జరిందన్నారు.ఆరోగ్యంగా మారిన విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడగా ప్రస్తుత సౌకర్యాల పట్ల విద్యార్థినులు సంతృప్తి వ్యక్తం చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ నర్సమ్మ పాల్గొన్నారు.

బీవీఆర్ఐటీతో క్యూఎన్ఎక్స్ అవగాహన ఒప్పందం



బీవీఆర్ఐటీతో అవగాహన ఒప్పందం చేసుకుంటున్న క్యూఎన్ఎక్స్ సాఫ్ట్‌వేర్ సంస్థ

నర్సాపూర్, ఏప్రిల్ 16: నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీ కళాశాలతో క్యూఎన్ఎక్స్ సాఫ్ట్‌వేర్ సంస్థ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంతో బుధవారం ఎంవోయూ చేసుకున్నది. హై-పర్ఫార్మెన్స్ ఎంబైడెడ్ సొల్యూషన్స్ డెవలప్‌మెంట్‌కు క్యూఎన్ఎక్స్ కంపెనీ ప్రసిద్ధి చెందింది. ఈ సందర్భంగా కళాశాల ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డా. జె.బంగారాజు మాట్లాడుతూ క్యూఎన్ఎక్స్ సాఫ్ట్‌వేర్ ద్వారా ఆటోమోటీవ్ మెడికల్ డివైజ్‌లు, ఇండస్ట్రీయల్ కంట్రోల్స్, రోబోటిక్స్, కమర్షియల్ వెహికల్స్, రైల్, ఏరోస్పేస్ వంటి విభాగాల్లో విస్తృత సేవలందిస్తుందని వెల్లడించారు. 1980లో స్థాపించిన ఈ కంపెనీ కెనడాలోని ఓట్టావా ద్వారా ప్రధాన కార్యాలయం కలిగి ఉంటుందన్నారు. క్యూఎన్ఎక్స్ ఎంబైడెడ్ సాఫ్ట్‌వేర్ ద్వారా సురక్షితమైన ఆపరేటివ్ సిస్టమ్, హైపర్‌వైజర్, మిడిల్‌వేర్ సొల్యూషన్స్, డెవలప్‌మెంట్‌కు అందించడంలో ముందుంటుందని పేర్కొన్నారు. ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా ఇంజినీరింగ్ విద్యార్థులకు ప్రాజెక్ట్ శిక్షణ, ఇంటర్న్‌షిప్‌లు, మెడికల్‌కు సంబంధించిన ప్రాజెక్టు కంటెస్టులు హ్యాకథాన్స్ పాల్గొనేందుకు బలమైన పునాదిగా నేర్పిస్తుందన్నారు. ఒప్పందంలో ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డా.బి.సంజీవరెడ్డి, డా.అనిరుధ్, క్యూఎన్ఎక్స్ నుంచి దశరథ, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై నిర్లక్ష్యం చేయొద్దు

ప్రమాదాల నివారణ పద్ధతులు చూపుతున్న సిబ్బంది

రామాయంపేట, ఏప్రిల్ 16: అగ్నిప్రమాదాలపై నిర్లక్ష్యం వహించొద్దని, వెంటనే తమకు ఫోన్ చేస్తే మీ ముందుంటామని రామాయంపేట అగ్నిమాపక సిబ్బంది అన్నారు. బుధవారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని పలు వార్డుల్లో అగ్ని ప్రమాదాలపై తీసుకునే చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫైర్‌మెన్లు చంద్రాగౌడ్, ప్రవీణ్, సత్య, నర్సగౌడ్, శంకర్ ఉన్నారు.

24న పీపుల్స్ ప్రోగ్రెసివ్ ట్రస్ట్ టాలెంట్ టెస్ట్

నర్సాపూర్, ఏప్రిల్ 16: ఈ నెల 24వ తేదీన ఉదయం పీపుల్స్ ప్రోగ్రెసివ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించబడుతున్న ప్రగతి విద్యానికేతన్ పాఠశాలలో చేరడానికి ప్రవేశ పరీక్ష న్యూ హైస్కూల్ మెదక్‌లో నిర్వహిస్తున్నట్లు టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవి, గంగాధర్ తెలిపారు. 4, 5, 6 తరగతులు చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్ష రాయడానికి అర్హులని పేర్కొన్నారు. ఈ పరీక్షలో ఎంపికైన విద్యార్థులకు ట్రస్ట్ వారు డిగ్రీ వరకు ఉచిత విద్యతో పాటు ఉచిత హాస్టల్ వసతి సౌకర్యం కల్పిస్తారన్నారు. విద్యార్థుల ఎంపిక క్రమంలో అనాథ, తల్లిలేని, తండ్రి లేని, నిరుపేద కుటుంబాలకు చెందిన పిల్లలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకోడానికి గడువు ఏప్రిల్ 18 సాయంత్రం 8 గంటల వరకు ఉంటుందని తెలిపారు. వివరాలకు 994960022664, 7989730251ను సంప్రదించాలని కోరారు.

ఓపెన్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 16: ఈనెల 20 నుంచి 26వ తేదీ వరకు ఇంటర్, పదో తరగతి ఓపెన్ స్కూల్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని డీఈవో రాధాకిషన్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులకు శిక్షణ ఏర్పాటుచేశారు. డీఈవో మాట్లాడుతూ పరీక్ష రాసే అభ్యర్థులతో పాటు ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది సెల్ ఫోన్లు తీసుకురావదన్నారు. పరీక్ష రాసే అభ్యర్థులను గుర్తించడానికి డైరెక్టర్ ఆదేశాల మేరకు హాల్ టికెట్‌తో పాటు ఆధార్‌కార్డు గాని, ఫొటో స్పష్టంగా కనిపించే గుర్తింపు కార్డును తప్పనిసరిగా తీసుకుని రావాలన్నారు. కేంద్రాలకు 5 నిమిషాలకు మించి ఆలస్యంగా వస్తే అనుమతించబడదన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో ఒక సిట్టింగ్ స్క్వాడ్‌తో పాటు ఇద్దరు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించినట్లు తెలిపారు. జిల్లాలో పదో తరగతికి 459 మంది, ఇంటర్‌కు 875 మంది పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటలు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మెదక్, నర్సాపూర్, తూప్రాన్‌లో ఒక్కొక్కటి చొప్పున కేంద్రాలు, ఇంటర్ కోసం మెదక్, నర్సాపూర్‌లో రెండు చొప్పున, తూప్రాన్ ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఉమ్మడి మెదక్ జిల్లా సాంస్కృతిక విద్యా సమన్వయ అధికారి వెంకటస్వామి, డీఆర్‌డీసీ అధికారి లక్ష్మారెడ్డి సూచనలు చేసినట్లు డీఈవో తెలిపారు.

పాఠశాలను ప్రారంభించాలి

చిలిపిచెడ్, ఏప్రిల్ 16: మండలంలోని గౌతాపూర్ గ్రామ శివారులో నిర్మించిన పాఠశాల భవనంను వచ్చే అకాడమిక్ వరకు ప్రారంభించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు, డీఈవో రాధాకిషన్‌కు మాజీ సర్పంచ్ నదరి స్వరూపావిఠల్ వినతి పత్రం అందజేశారు. బుధవారం ఆయన జిల్లా కేంద్రంలో అధికారులకు వినతి పత్రం అందజేసి పాఠశాలలో నీటి వసతి, ఫర్నిచర్ వట్టివి ఏర్పాటు చేయాలని తెలిపారు. గౌతాపూర్ గేటు వద్ద నూతన బస్టాండ్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని కలెక్టర్‌ను కోరారు.

చిన్ననాటి స్నేహితుల ఆర్థిక సాయం

శివ్వంపేట, ఏప్రిల్ 16: మండలంలోని పెద్ద గొట్టిముక్ల గ్రామానికి చెందిన గుండ కొమురయ్య వారం రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న 1998-1999 బ్యాచ్ మిత్రులు చిన్ననాటి మిత్రుడి కుటుంబానికి రూ.27 వేల నగదును బుధవారం అందజేశారు. కాముని అనిల్, వడ్ల వీరేశంచారి, దొంతి నారాయణ గౌడ్, రేవు యాదగిరి, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలి

- పెండింగ్ బోనస్ డబ్బులు ఇవ్వాలి
- సమస్యలు లేకుండా చూడాలి
- రజతోత్సవ సభను విజయవంతం చేయాలి
- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

చిలిపిచెడ్: గంగారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నర్సాపూర్ ఎమ్మెల్యే

నర్సాపూర్: సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

చిలిపిచెడ్, ఏప్రిల్ 16: పండిన ప్రతి ధాన్యం గింజకూ ప్రభుత్వం రూ.500 బోనస్ ఇవ్వాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం చిలిపిచెడ్‌తో పాటు జగ్గంపేట, గంగారం, అజ్జమర్రి, బండపోతుగల్, ఫైజాబాద్, శీలాంపల్లి, సోమక్కపేట సొసైటీ, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏపీఎం ప్రేమలత, పీఏసీఎస్ చైర్మన్ ధర్మారెడ్డి మండల ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దళారులకు ధాన్యం అమ్మి మోసపోవద్దన్నారు. కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని అమ్ముకోవాలన్నారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి తహసీల్దార్ సింధూజ, ఏఈవో కృష్ణవేణి, పీఏసీఎస్ సీఈవో పోచయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, రైతుబంధు మండల మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి, యూత్ మాజీ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

దళారులకు ధాన్యం విక్రయించవద్దు

వెల్దుర్తి, ఏప్రిల్ 16: రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించి ఆర్థికంగా ఇబ్బందులకు గురికావద్దనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని కుకునూర్, మన్నెవారి జలాల్‌పూర్, దామరంచ, ధర్మారం, అందుగులపల్లి గ్రామాల్లో పీఏసీఎస్, మహ్మద్‌నగర్‌తండాలో ఐకేపీ ఆధ్వర్యంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గన్నీ సంచులు ఆలస్యంగా రావడం, ధాన్యం తరలింపులో ఇబ్బందులు తలెత్తాయని, ఇప్పుడు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

రజతోత్సవ సభకు తరలిరావాలి

బీఆర్ఎస్ 25 ఏండు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 27న హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించే రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ నిర్ణయం మేరకు నియోజకవర్గం నుంచి మూడు వేల మందితో సభకు తరలివెళ్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలతో ప్రజలు బీఆర్ఎస్ వైపు చూస్తున్నారని, వారికి భరోసా కల్పించేలా, రజతోత్సవ సభను పార్టీ అధినేత కేసీఆర్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకోనున్నామన్నారు. నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు తరలిరావాలని సూచించారు. కార్యక్రమాల్లో పీఏసీఎస్ చైర్మన్ అనంతరెడ్డి, తహసీల్దార్ కృష్ణ, ఏవో ఝాన్సీ, ఉపాధ్యక్షుడు కరణం మురళీ, డైరెక్టర్లు నర్సింలు, రమేశ్‌చందర్, మాజీ జడ్పీటీసీ రమేశ్‌గౌడ్, నాయకులు మోహన్‌రెడ్డి, నర్సింలు, భూమయ్య, శ్రీనివాస్‌రెడ్డి, కిష్టయ్య, మల్లేశం, సత్యనారాయణగౌడ్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరం

నర్సాపూర్, ఏప్రిల్ 16: సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరంలాంటిదని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. ఖాజీపేట్‌కు చెందిన చింతమల్ల యాదమ్మ కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో ప్రైవేట్ దవాఖానలో చికిత్స చేయించుకుని, సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నది. ఎమ్మెల్యే సహకారంతో ఆమెకు రూ.25,500 చెక్కు మంజూరైంది. బాధిత కుటుంబానికి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఖాజీపేట్ బీఆర్ఎస్ నాయకులు సుధాకర్‌రెడ్డి, నగేశ్, యాదగిరి, వీరేశ్, రమేశ్, నజీర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దు

చిన్నశంకరంపేట గవ్వలపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రోహిత్

చేగుంట: సమావేశంలోమాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో చిన్నరెడ్డి తదితర అధికారులు

నిజాంపేట: బచ్చురాజ్‌పల్లిలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఐకేపీ సీసీ లక్ష్మీ

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 16: ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని ఎమ్మెల్యే రోహిత్ సూచించారు. చిన్నశంకరంపేటలోని గవ్వలపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్ మన్నన్, ఏవో లక్ష్మీప్రవీణ్, చిన్నశంకరంపేట, జంగరాయి సొసైటీల చైర్మన్లు అంజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అరుణ ప్రభాకర్ పాల్గొన్నారు. ఖాజాపూర్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు.

పాపన్నపేటలో..

పాపన్నపేట, ఏప్రాల్ 16: ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుతో దళారుల వ్యవస్థ మాయమైందని ఎమ్మెల్యే రోహిత్‌రావు అన్నారు. పోడ్‌చన్‌పల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం, మత్స్య సహకార భవనం ప్రారంభించారు.

పౌష్టికాహారంతోనే విద్యార్థుల ఎదుగుదల

రామాయంపేట, ఏప్రిల్ 16: పోషక విలువలతో కూడిన ఆహారంతోనే విద్యార్థుల ఎదుగుదల ఉంటుందని ఎమ్మెల్యే రోహిత్ రావు పేర్కొన్నారు. రామాయంపేటలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బేటీపడావో, బేటీ బచావో కార్యక్రమంలో పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందుల్లేకుండచూడాలి

చేగుంట,ఏప్రిల్16:రైతులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండ వరి ధాన్యం సేకరణ జరుగాలని చేగుంట తహసీల్దార్ శ్రీకాంత్ పేర్కొన్నారు. కలెక్టర్, ఆర్డీవో ఆదేశాల మేరకు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో,వ్యవసాయ శాఖ, ఐకేపీ, సొసైటీ అధికారులతో పాటు రైస్ మిల్లర్స్ వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులతో, అధికారులుతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీవో ప్రశాంత్,ఆర్ఐ జై భారత్ రెడ్డి, సంతోష్, ఏవో హరిప్రసాద్, ఏపీఎం లక్ష్మీ నర్సమ్మ, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ దివ్యశ్రీ, ఈవో నరేశ్, నరేష్,వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

నిజాంపేట, ఏప్రిల్ 16: మండలంలోని బచ్చురాజ్‌పల్లి, జడ్పెరువు తండాలో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సీసీ లక్ష్మి ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఈవో రమ్య, ఐకేపీ అధ్యక్షురాలు స్వప్న, సీఏ మంజుల, కోశాధికారి సుమలత, ఓబీ రాజేశ్వరి, పంచాయతీ కార్యదర్శి రాము రైతులు మల్లేశం, రాజు, శ్రీనివాస్‌నాయక్, యాదగిరి, నరేశ్, ఆంజనేయులు ఉన్నారు.

రేపు కంటి ఉచిత వైద్య శిబిరం

రామాయంపేట, ఏప్రిల్ 16: పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల ఆధ్వర్యంలో కంటి ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు శంకర్ ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని విశ్రాంత భవనంలో నిర్వహించే ఈ శిబిరానికి అందరూ చేరుకుని విజయవంతం చేయాలని కోరారు.

వడదెబ్బతో వృద్ధుడు మృతి

బాలయ్య (ఫైల్)

రామాయంపేట, ఏప్రిల్ 16: వడదెబ్బతో వృద్ధుడు మృతి చెందిన ఘటన రామాయంపేటలో మంగళవారం రాత్రి జరిగింది. పట్టణానికి చెందిన ఎరుకల బాలయ్య (65) కూలీ పనులు చేస్తూ జీవించేవాడు. ఎండదెబ్బ తగలడంతో రెండు రోజుల నుంచి ఇంటివద్దే ఉంటున్నాడు. మంగళవారం రాత్రి జ్వరం తీవ్రత ఎక్కువై అస్వస్థతకు గురయ్యాడు. దవాఖానకు తరలించేంత లోపే మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు.

పూర్వ విద్యార్థులు పరీక్ష రాసే అవకాశం

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 16: మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2016 నుంచి 2021 వరకు విద్యనభ్యసించి ఫెయిల్ అయిన విద్యార్థులు పరీక్షలు రాసుకోవడానికి ఉస్మానియా విశ్వవిద్యాలయం అనుమతి ఇచ్చినట్లు ప్రిన్సిపాల్ హుస్సేన్ ప్రకటనలో తెలిపారు. 6 సెమిస్టర్లలో ఎవరైనా ఫెయిలైన విద్యార్థులుంటే పరీక్షలు రాసుకునే వెసులుబాటు కల్పించినట్లు పేర్కొన్నారు. ఎలాంటి అపరాధ రుసుం లేకుండా మే 19వ తేదీ వరకు, అపరాధ రుసుంతో మే 29వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించాలని తెలిపారు. పూర్తి వివరాలకు కళాశాలలోని పరీక్షా విభాగం అధికారి శరత్‌రెడ్డిని సంప్రదించాలని సూచించారు.

తండ్రిని చంపడానికి ప్రయత్నించిన కొడుకు జైలుకు..

నర్సాపూర్, ఏప్రిల్16: తండ్రిని చంపడానికి ప్రయత్నించిన కొడుకును జైలుకు తరలించినట్లు ఎస్సై లింగం తెలిపారు. ఎస్సై మాట్లాడుతూ ఈనెల 12న మండలంలోని చిన్నచింతకుంటలో వడ్ల దశరథ (60)ను అతని మొదటి కుమారుడు వడ్ల నాగరాజు రెండో పెండ్లి చేయడం లేదని, ఆస్తి పంచి ఇవ్వడం లేదని తండ్రిని చంపాలని నిర్ణయించుకున్నాడు. నర్సాపూర్‌లోని బస్టాండ్‌లో కత్తిని కొనుక్కుని ఆ గ్రామానికి వెళ్లి తండ్రితో గొడవ పడి, తన వద్దనున్న కత్తితో తండ్రి చాతిపై, పొట్టపై, తలపై, చేతులపై పొడిచి అక్కడి నుంచి పారిపోయాడు. బాధితుడి భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, నిందితుడిని పట్టుకుని రిమాండ్‌కు తరలించారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక ఆదాయం

అల్లాదుర్గం, ఏప్రిల్ 16: ఆయిల్‌పామ్ సాగుతో రైతుల ఆదాయం మరింత పెరుగుతుందని లివ్ ఫామ్ కంపెనీ అసిస్టెంట్ మేనేజర్ జాన్సన్ అన్నారు. శుక్రవారం ముస్లాపూర్‌లో ఆయిల్ ఫామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు వరి, మొక్కజొన్న, పత్తి పంటల్లో స్వల్పకాలిక ఆదాయాన్ని పొందుతున్నప్పటికీ దీర్ఘకాలికంగా పెరగాలంటే తప్పనిసరిగా ఆయిల్ పామ్ సాగుతోనే సాధ్యమన్నారు. మండల విస్తరణ అధికారి అమృత్ పాల్గొన్నారు.

మట్టిని అక్రమంగా తరలిస్తే చర్యలు

నిజాంపేట, ఏప్రిల్ 16: మట్టిని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని డిప్యూటీ తహసీల్దార్ రమ్యశ్రీ హెచ్చరించారు. చల్మెడలోని చప్పెటకుంటలో అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు, జేసీబీని గుర్తించినట్లు ఆమె తెలిపారు. వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

జూదరుల అరెస్ట్

శివ్వంపేట, ఏప్రిల్ 16: పేకాడుతున్న ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. చండి గ్రామంలోని చండి కామాత ఆలయ సమీపంలో బుధవారం పేకాడుతున్న ముగ్గురిని ఎస్సై మధుకర్‌రెడ్డి పట్టుకున్నారు.

తాగునీటి సమస్య రాకుండా చూడాలి

- జడ్పీ సీఈవో ఎల్లయ్య

రికార్డులను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో ఎల్లయ్య

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 16: గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జడ్పీ సీఈవో ఎల్లయ్య సూచించారు. బుధవారం చిన్నశంకరంపేట ఎంపీడీవో కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. గ్రామాల్లో ఈజీఎస్ పనులు ఎలా జరుగుతున్నాయని అధికారులకు అడిగి తెలుసుకున్నారు. ఈజీఎస్ పనుల వద్ద కూలీలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయనతో ఎంపీడీవో దామోదర్, ఈజీయస్ అధికారులు ఉన్నారు

వెల్దుర్తిలో..

వెల్దుర్తి, ఏప్రిల్ 16: వేసవి దృష్ట్యా ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జడ్పీ సీఈవో ఎల్లయ్య అన్నారు. మాసాయిపేట పంచాయతీ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇన్‌చార్జి ఎంపీడీవో విఘ్నేశ్వర్, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామాలలో తాగునీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగంగా జరిగేలా చూడాలన్నారు. రాజీవ్ యువవికాసం పథకంలో నిజమైన అర్హులకు పథకాలు అందేలా చూడాలన్నారు.

రైతులకు పట్టా పాస్ బుక్కులివ్వాలి

నర్సాపూర్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట కొంగోడు రైతుల ధర్నా



నర్సాపూర్ ఆర్డీవోకు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

కొల్చారం, ఏప్రిల్ 16: నర్సాపూర్ డివిజన్‌లోని కొల్చారం మండలం కొంగోడు గ్రామంలో 209 సర్వే నంబర్‌లో పలువురు రైతులు సుమారు 70 ఏండ్లుగా సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం నర్సాపూర్ ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ధర్నాకు సీపీఎం మద్దతు తెలిపింది. కబ్జాలో ఉన్న రైతులకు పట్టా పాస్ బుక్కులు ఇవ్వాలని ఆర్డీవోకు వినతి అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మల్లేశం, సీపీఎం డివిజన్ కార్యదర్శి నాగరాజు మాట్లాడాతూ 2002 నుంచి చేసిన భూ పోరాటాలకు ప్రభుత్వం స్పందించి 2012 రెవెన్యూ, ఫారెస్ట్ శాఖలు సర్వే నిర్వహించి, భూమిని గుర్తించి రైతులకు పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. నేటి వరకు ఒక్క పట్టా ఇవ్వలేదన్నారు. 209 సర్వే నంబర్‌లో 93.13 ఎకరాల భూమి ఉన్నదన్నారు. 8 ట్రాన్స్‌ఫార్మర్లు, 28 బోరుబావులతో 110 కుటుంబాలకు చెందిన రైతులు వ్యవసాయం చేస్తున్నారన్నారు. కబ్జాలో ఉన్న ప్రతి రైతుకు పట్టా బుక్కులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆర్డీవో మహిపాల్ మాట్లాడుతూ త్వరలో సర్వే నిర్వహించి ఆ భూమి రెవెన్యూ పరిధిలో ఉన్నట్లయితే అర్హులకు పట్టాపాస్ బుక్కులు వచ్చేలా కృషి చేస్తానని ఆర్డీఓ హామీ ఇచ్చారని తెలిపారు.

వధువుకు ఆర్థిక సాయం

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 16: మండలంలోని చందాపూర్‌కు చెందిన తుడుం నవనీత వివాహానికి మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి రూ.5వేల ఆర్థిక సాయాన్ని స్థానిక బీఆర్ఎస్ నాయకుల ద్వారా బుధవారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రమాదేవి, శ్రీనివాస్ నాయకులు పెంటయ్య, శివరాములు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గాలి కుంటు టీకాలు వేయించాలి

శివ్వంపేటలో పశువులకు గాలికుంటు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

శివ్వంపేట, ఏప్రిల్ 16: పశువైద్యశాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచితంగా అందిస్తున్న గాలికుంటు టీకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశువైద్యాధికారి వెంకటయ్య అన్నారు. బుధవారం శివ్వంపేటతో పాటు చెన్నాపూర్‌లో గాలికుంటు టీకాలు వేశారు. నెల రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో పశువులకు టీకాలు వేయించుకోవాలని సూచించారు. ఆయన వెంట మండల పశువైద్యాధికారి సంధ్యారాణి, ప్రియాంక, గోపాల మిత్ర గోపాల్ తదితరులు ఉన్నారు.

వెల్దుర్తిలో..

వెల్దుర